క్లుప్తంగా

సీఎం సహాయనిధి పేదలకు వరం



మహిళకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల

ఆళ్లగడ్డ: వైద్య ఖర్చులు భరించలేని పేద, మధ్య తరగతి వారికి ముఖ్యమంత్రి సహాయనిధి వరంలాందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని 12 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.7.63 లక్షల చెక్కులను బాధితుల కుటుంబ సభ్యులకు అందజేశారు. దొర్నిపాడు ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, నరసింహారెడ్డి ఉన్నారు.

'పది' పరీక్ష కేంద్రాల తనిఖీ



మందులను పరిశీలిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

ఉయ్యాలవాడ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్‌లో జరుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను తహసీల్దార్ రవికుమార్, ఆళ్లగడ్డ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. విద్యార్థులు పరీక్షలు ప్రశాంతంగా రాస్తున్నట్లు చెప్పారు. ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ కార్యాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న పి.శ్రీనివాసరావు

రుద్రవరం: స్థానిక ఎంఈఓ కార్యాలయాన్ని స్టేట్ విద్యాశాఖ ఎస్పీడీ కార్యాలయం మానిటరింగ్ అధికారి పి.శ్రీనివాసరావు సోమవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరంలో దాదాపు 5వేల మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందజేయాల్సి ఉందన్నారు. వాటికి సంబంధించిన స్టాక్ వివరాలు, రికార్డులు పరిశీలించారు. అసిస్టెంట్ ఏఎంఓ యూనస్ బాషీ, ఏపీఎంఓ దేవానందం, నాడు–నేడు ఏఈ మధుసూదన్‌రెడ్డి, సీఆర్‌పీలు, పీఆర్‌టీ, ఐఈఆర్‌టీ ఉన్నారు.

నేటి నుంచి రావెప్ ప్రోగ్రాం

గోస్పాడు: మండలంలోని దీబగుంట్ల గ్రామంలో అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం రావెప్ (ఆర్ఏడబ్ల్యూఈపీ) కార్యక్రమం నిర్వహిస్తామని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శివశంకర్ నాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహానందిలోని వ్యవసాయ కళాశాలకు చెందిన అగ్రికల్చర్ బీఎస్సీ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి ప్రణాళిక, మొక్కలు నాటడం, వెటర్నరీ క్యాంపు, స్వచ్ఛభారత్, హెల్త్ క్యాంపు, రైతు సదస్సులు వంటి కార్యక్రమాలు చేపడతామని వివరించారు.

నేడు ఎమ్మెల్యే రాక

రుద్రవరం: మండల కేంద్రానికి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మంగళవారం రానున్నారని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పొదుపు సంఘాల మహిళలకు మూడో విడత ఆసరా చెక్కులు అందజేస్తారని చెప్పారు. అలాగే కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, పుట్లాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి పాల్గొంటారని, డ్వాక్రా మహిళలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

బేగరీల సమస్యలు పరిష్కరించాలి

రుద్రవరం: మాల బేగరీల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోసుల ఇసాక్, ప్రధాన కార్యదర్శి జి.సాల్మన్, రాష్ట్ర కార్యదర్శి బాల మద్దయ్య కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటయ్యకు సోమవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పల్లెలు,పట్టణాల్లో తర తరాలుగా మాలలు బేగరులు, శ్మశానవాటికల్లో కార్మికులుగా పని చేస్తున్నారని, అయితే ప్రభుత్వాలు వారికి సరైన గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా వారిని గుర్తించి అర్హులైన వారికి పింఛన్లు, గౌరవ వేతనం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటయ్య, కోశాధికారి చెన్నయ్య ఉన్నారు.

ఆరోగ్యకరం..ఉపశమనం

- కలింగరతో బహుళ ప్రయోజనాలు
- వేసవిలో ఎండ వేడిమి నుంచి రక్షించుకునేందుకు అధికంగా వినియోగిస్తున్న ప్రజలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న కలింగరకాయ ముక్కలు



కలింగరికాయ ముక్కలను తింటున్న ప్రజలు

నంద్యాల(అర్బన్): ఈ ఏడాది మార్చి ఆరంభం నుంచే ఎండ తీవ్ర అధికంగా ఉంది. దీంతో వేసవి తాపాన్ని తీర్చేందుకు ప్రజలు కలింగర (పుచ్చకాయలు), కర్బూజా పండ్లు వినియోగిస్తున్నారు. నంద్యాల పట్టణంలో ప్రధాన కూడళ్లు మునిసిపల్ కార్యాలయం ఎదుట, వైఎస్సార్ జంక్షన్ సమీపంలో, సంజీవనగర్, ఆర్టీసీ బస్‌స్టాండ్, ఎన్టీఆర్ కాంప్లెక్స్, టెక్కె మార్కెట్ యార్డు దగ్గర, నూనెపల్లె తదితర ప్రాంతాల్లో ఆయా పండ్లను రాసులగు పోసి అమ్ముతున్నారు. కాయ వాటి పరిమాణాన్ని బట్టి రూ.50 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. వేసవి తాపాన్ని, దాహాన్ని తీర్చేందుకు అద్భుతమైన ఫలం పుచ్చకాయ. ఈ పండుతో డీహైడ్రేషన్ నుంచి తక్షణం ఉపశమనం పొందవచ్చు.

పోషకాల కలింగర...

శరీరంలో నీటి శాతం, షుగర్ లెవల్స్ తగ్గిపోకుండా ఉండేందుకు పుచ్చకాయముక్కలు మంచి ఆప్షన్ అని వైద్యులు పేర్కొంటున్నారు. వీటిల్లో పోషకాలు, వ్యాధినిరోధకశక్తిని పెంచే యాంటీఆక్సిడెంట్లు, క్యాల్షియం, సోడియం, మెగ్నీషియం, పొటాషియం, క్లోరిన్, జీలాకెరోటిన్లు, ఆల్కలైన్, విటమిన్–ఏ,బీ,బీ6,సి,ఈ, సుక్రోజ్, ఫ్రక్టోజ్, గ్లూకోజ్, ఎలక్ట్రోలైట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎండకాలంలో మన శరీరానికి కావలసిన పోషకాలను అందిస్తాయి. ఈ పండును తినడం వల్ల చర్మానికి అన్ని రకాల అమినోయాసిడ్లు, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, నీరు అధికంగా లభించడమే కాకుండా ఇతర శరీర భాగాలకు కూడా ఆరోగ్యాన్ని సిద్ధింపజేస్తాయి. ఇక మూత్రసంబంధ వ్యాధులకు అద్భుతమైన ఔషధంగా పేర్కొంటున్నారు. అయితే ఏ పండునైనా పరిమితంగా తీసుకుంటే వాటి ప్రయోజనాలు దక్కుతాయని, అపరిమితంగా తీసుకుంటే వాటి నుంచి అనర్థాలు కలిగుతాయని వైద్యులు చెబుతున్నారు.

- పుచ్చకాయలు రక్తపోటు, గుండెపోటును తగ్గిసాయి. మహిళలకు ఎంతో మేలు చేస్తాయి.

శాస్త్రీయ నామం : సిట్రూలస్ లానాటస్
కుటుంబం : కుకుర్బిటేసే
సాధారణ నామం : వాటర్ మిలాన్, తర్బూజా
నీటి శాతం : 91.45 గ్రాములు (వందగ్రాముల పండులో)
శక్తి : 30 కేలరీలు
కార్బోహైడ్రేట్స్ : 7.55 గ్రాములు
చక్కెర : 6.2 గ్రాములు
ఫైబర్ : 0.4 గ్రాములు
కొవ్వు : 0.15 గ్రాములు
పొట్రీన్లు : 0.61 గ్రాములు

- విరేచనాలు, కడుపునొప్పి, ఉబ్బరం, ఎసిడిటికి మంచి విరుగుడుగా పనిచేస్తుంది.
- క్యాల్షియం అధికంగా ఉండటంతో కీళ్ల నొప్పులు, వాతం లాంటి రోగాల నుంచి ఉపశమనం లభిస్తుంది.
- కిడ్నీలో రాళ్లున్న వారు, మలబద్దకంతో బాధపడుతున్న వారికి అపర సంజీవనిగా చెప్పవచ్చు.
- కామెర్లు, పైత్యం, వికారం, తలనొప్పి, నోడు తడారిపోవడం వంటి సమస్యలకు పరిష్కారం కూడా..
- గర్భిణులు ఈ పండు తింటే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుంది.
- ఈ పండులో అధిక శాతం నీరు, పీచు కలిగి ఉండటంతో చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

ఎండ వేడిమి నుంచి ఉపశమనం



ఎండలు బాగా పెరిగిపోయాయి. బయట తిరగాలంటే ఇబ్బందిగా ఉంది. పనుల మీద బయటకు వచ్చినప్పుడు కలింగర పండు తినడం వల్ల కొంత ఉపశమనం పొందుతున్నాం. మార్కెట్లలో కలింగర ధరలు కూడా అధికంగా ఉన్నాయి.పండు మొత్తం కొనలేక, ముక్కలుగా కోసిన వాటిని తిని సేద తీరాల్సి వస్తుంది. వేసవి కాలంలో ఇలాంటి పండ్లను తినడం ద్వారా శరీరంలో కొంత శక్తిని కూడగట్టుకోవచ్చు.
– మనోహర్,టీవీ మెకానిక్, దేవనగర్, నంద్యాల

ఆరోగ్యానికి మేలు



కంలింగరలో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఐరన్, విటమిన్–సీ, ఏ, బీ6, డీ1 విటమిన్లతో పాటు పొటాషియం, మెగ్నీషియం వంటి వాటిని శరీరానికి అందిస్తుంది.వంద గ్రాముల పుచ్చకాయలో 90శాతం నీరు, 46 శాతం కేలరీలు, 7 శాతం కార్బోహైడ్రేట్‌లు ఉంటాయి. పుచ్చకాయలో ఉండే ఫైటో న్యూట్రియన్స్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వేసవిలో పుచ్చకాయలు తినడం ద్వారా రక్తనాళాలు విచ్చుకొని రక్తప్రసరణ సులువుగా జరుగుతుంది. కూల్‌డ్రింక్స్‌కు బదులుగా ప్రజలు ఇలాంటి పండ్లు తీసుకోవాలి.
–డాక్టర్ అంకిరెడ్డి,
మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, నంద్యాల



బిళ్లలాపురంలో వృద్ధురాలికి పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

పథకాలతో ప్రజలకు ఆర్థిక భరోసా

నంద్యాల(రూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, సుభిక్ష పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బిళ్లలాపురం గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలను వివరిస్తూ, వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని అక్కడే ఉన్న అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు చేరుతోందో లేదో తెలుసుకునేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఎంతో కొంత ఇచ్చినప్పటికీ అర్హులకు పథకాలు అందలేదని, ప్రస్తుతం అర్హత ఉంటే చాలు ఇంటికే వచ్చి పథకాలు వర్తింపుజేసి అందజేస్తున్నారని, ఇది నిజమా..కాదా అని వారి నుంచి సమాధానం రాబట్టారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మెన్ మహేశ్వరరెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మెన్ సిద్ధం శివరాం, మండల కన్వీనర్ బసవేశ్వరరెడ్డి, సర్పంచ్ రమణమ్మ, ఎంపీటీసీ రామలక్ష్మమ్మ, నాయకులు శంకర్‌రెడ్డి, శ్రీరాములు, మద్దిలేటి, వెంకటసుబ్బయ్య, చిన్న రామకృష్ణారెడ్డి, పెద్ద రామకృష్ణారెడ్డి, శివరాంరెడ్డి, పుల్లారెడ్డి, భూమా వెంకటకృష్ణారెడ్డి, శేషిరెడ్డి పాల్గొన్నారు.

ఊరు.. వాడా.. జగనన్నే మా భవిష్యత్



హరినగరంలో అభిప్రాయాలు నమోదు చేస్తున్న దృశ్యం



కొండాపురంలో మహిళ అభిప్రాయాలను తెలుసుకుంటున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని ఊరు వాడల్లో నువ్వే మా నమ్మకం జగన్, జగనన్నే మా భవిష్యత్తు అనే కార్యక్రమం జోరుగా సాగుతోంది. మండల కన్వీనర్ పాణ్యం నా గేష్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని హరినగరంలో వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు,వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. అలాగే మండలం కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు.

శిరివెళ్ల: స్థానిక 4వ గ్రామ సచివాలయ పరిధిలోని 17,18 వార్డులలో కన్వీనర్లు సాలమ్మ, చంద్ర ఇంటింటికీ వెళ్లి అభిప్రాయాలు సేకరించి, పథకాల గురించి వివరించి స్టిక్కర్లను అతికించారు. మహదేవపురంలో సర్పంచు పెద్ది రమణయ్య, మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడు నరహరి, కన్వీనర్లు, గృహ సారథులు కార్యక్రమం నిర్వహించారు.

దొర్నిపాడు: డబ్ల్యూ గోవిందిన్నె, దొర్నిపాడు, కొండాపురం, క్రిష్టిపాడు గ్రామాల్లో సోమవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, శివారెడ్డి, కొండాపురం సర్పంచ్ మాధవీలత, మనోహర్‌రెడ్డి, డీలర్ శివుడు, పయిడేల శివరామిరెడ్డి లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎర్ర నర్సిరెడ్డి, శాంతయ్య, చిన్నమద్దిలేటి, డీలర్ పెద్దన్న , పల్లె శంకర్‌రెడ్డి, భాస్కర్, విజయలలిత, జాకీర్‌బాషా పాల్గొన్నారు.

సంక్షేమమే పరమావధి

శిరివెళ్ల: పేదల సంక్షేమమే పరమావధిగా తమ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రానాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక 4వ గ్రామ సచివాలయ పరిధిలోని కాదరబాదర గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఇంటింటికీ మూడున్నరేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతు పథకాల అమలులో అవినీతి, సిఫార్సులకు తావులేకుండా నేరుగా ప్రజల ఖాతాలోనే జమ చేయడం దేశంలో ఎక్కడా లేదన్నారు. అనంతరం గ్రామసమీపంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీపీ నాయక్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్‌సలాం, సర్పంచు లక్కాకుల సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నజీర్, దేవస్థానం చైర్మన్ దాదిరెడ్డి తిమ్మరాయుడు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఈఓ ఆర్డీ సాల్మన్ రాజు, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, సచివాలయ కన్వీనర్లు బండి వెంకట చెన్నయ్య పాల్గొన్నారు.



కాదరబాదరలో లబ్ధిదారుడికి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

ఉద్యోగం ఇప్పిస్తానని రూ.15 లక్షలు టోకరా

బొమ్మలసత్రం: ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నంద్యాల పట్టణానికి చెందిన కరుణాకర్, రంగమ్మ, సోమశేఖర్ రూ.15 లక్షలు తీసుకుని మోసం చేశారని, విచారించి న్యాయం చేయాలని బాధితుడు ఉదయ్‌కుమార్ జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి 60 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుల్లో చట్టపరమైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించామని, మరికొన్నింటిని ఆయా స్టేషన్ అధికారులకు పంపించామన్నారు. స్పందన ఫిర్యాదులు పునరావృతం కాకుండా స్టేషన్ అధికారులు సరైన చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు.



స్పందనలో ఫిర్యాదు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

- పేరుసోముల గ్రామానికి చెందిన శేఖర్ తన నుంచి కుమారుడు ఆస్తి తీసుకొని అన్నం పెట్టకుండా ఇంటి నుంచి గెంటేశాడని, తన కుమారుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.

మా బలం..బలగం మీరే



సభకు హాజరైన మహిళలు



మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

- మాట తప్పిన బాబును నమ్మొద్దు
- పాలనలో తేడాలను గమనించండి
- గతంలో ఇన్ని పథకాలు ఎప్పుడైనా అందాయా
- ఇంత లబ్ధి చేకూరిందా.. ఆలోచించండి
- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

శిరివెళ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి బలం..బలగం మా ఆడపడుచులైన మీరే.. అందుకే జగనన్న పథకాలన్నీ మీ పేరుతో అమలు చేస్తున్నారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేశారు. మరోసారి మోసపూరిత మాటలతో మభ్యపెట్టడానికి వస్తున్నాడు.. నమ్మి మోసపోవద్దు అని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక షాదీఖానా ఆవరణలో ఆసరా మూడో విడత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 975 పొదుపు సంఘాలకు రూ.8.31 కోట్ల రుణమాఫీ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ పాలన, నేడు జగనన్న సాగిస్తున్న పాలనలో తేడాలను గమనించండి, ఇన్ని సంక్షేమ పథకాలు ఒక ఇంటికి ఎప్పుడైనా అందాయా, ఇంత మొత్తంలో లబ్ధి చేకూరిందా.. ఒక్కసారి ప్రశాంతంగా ఆలోచించండి, ఇంత మొత్తం నాడు ఎక్కడికెళ్లింది, లబ్ధిదారులు ఇప్పుడే వచ్చారా? గతంలో లేరా అని ప్రశ్నించారు. అందుకే ప్రతి ఇంటికి వెళ్లి ప్రగతిని వివరించి వారి అనుమతితో స్టిక్కర్లను అతికిస్తున్నామన్నారు. శిరివెళ్ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని అధికారంలోకి వచ్చిన ఏడాదికే డ్రైనేజీ వ్యవస్థ మెరుగుకు రూ.6 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ నాయక్, ఎంపీపీ నాయక్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్‌సలాం, సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్, మాజీ జెడ్పీటీసీ నజీర్, మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇందూరి ప్రతాపరెడ్డి, ఏపీ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ హఫీజ్, జిల్లా పంచాయతీ సర్పంచుల సంఘం అధ్యక్షురాలు మందాల రాధిక, మార్కెట్ యార్డు చైర్మన్ గంధం రాఘువరెడ్డి, ఉపాధ్యక్షుడు నరహరి, పార్టీ జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు బెక్కెం శకుంతలమ్మ, దాదిరెడ్డి తిమ్మరాయుడు, వంకదార సుబ్బసత్యనారాయణ శ్రేష్టి, సముద్రాల సత్యనారాయణశ్రేష్టి సర్పంచులు దూదేకుల ఉశేన్‌బీ, శివారెడ్డి, జింకల నాగన్న, మేర్వ చిన్న నరసింహ్మారెడ్డి, కందుల మల్లేశ్వరి, రఘునాధరెడ్డి, అయ్యలూరి సుభహాన్, రిటైర్డ్ ఎంఈఓ మహబూబ్‌బాషా, నాయకులు నరసింహారెడ్డి, సత్తార్ ప్రతాపరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రేపు ఏపీయూడబ్ల్యూజే జిల్లా మహాసభ

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా ఏపీయూడబ్ల్యూజే ప్రథమ మహాసభను ఈనెల 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా కన్వీనర్ శ్యాంసుందర్‌లాల్ తెలిపారు. సోమవారం కరపత్రాలను విడుదల చేసి మాట్లాడుతూ ప్రథమ మహాసభకు జర్నలిస్టులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. స్థానిక ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఉదయం 10గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఇందుకు జిల్లాలోని ప్రముఖ ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులకు ఆహ్వానం అందజేశామని చెప్పారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకుంటామన్నారు. సీనియర్ జర్నలిస్టులు చలం బాబు, మధుబాబు, ఉస్మాన్‌బాషా, మహేష్ యాదవ్, అరుణ్‌బాబు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

రుద్రవరం: గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ వేడుకల్లో భాగంగా మండలంలోని చిన్నకంబలూరు గ్రామంలో క్రైస్తవులు ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ తలారి చెన్నప్ప, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి,మండల కో ఆప్షన్ సభ్యుడు మదార్ సాహెబ్ పాల్గొన్నారు.

స్పందనపై నిర్లక్ష్యం తగదు

ఉయ్యాలవాడ: స్పందన కార్యక్రమాలపై అధికారులు నిర్లక్ష్యం వహించరాదని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ, మండల పరిషత్ కార్యలయాల్లో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమస్యలు పునరావృతం కాకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

పొలం ఆన్‌లైన్ చేయాలంటూ..

మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామానికి చెందిన పసల వెంకటస్వామి అనే రైతు.. తనకు సర్వే నంబర్ 784లో 0.50 ఎకరాల పొలం ఉందని, తమ పేరుపై ఉన్న పొలం ఆన్‌లైన్‌లో లేదని తహసీల్దార్ రవికుమార్‌కు స్పందలో అర్జీ ఇచ్చారు. తన పొలాన్ని ఆన్‌లైన్ చేసి హక్కుకల్పించాలని అభ్యర్థించారు. క్షేత్రస్థాయిలో విచారించి న్యాయం చేస్తామని తహసీల్దార్ చెప్పారు.

సైబర్ నేరాలను అరికట్టాలి

నంద్యాల(అర్బన్): సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలో అనేక ఆన్‌లైన్ యాప్స్ అశ్లీలతకు, ఆర్థిక నేరాలకు కేంద్రాలుగా మారాయని, వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు కోరారు. సైబర్ నేరాలను అరికట్టాలని కోరుతూ సోమవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం లెనిన్ బాబు మాట్లాడుతూ ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్‌లలో డేటింగ్, లివింగ్, ఫ్రెండ్స్ యాప్‌లతో యువతను టార్గెట్ చేసుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రణత్ యాదవ్, రవి, విజయ్, సురేష్, అంజి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఉయ్యాలవాడ: డీఎంఅండ్‌హెచ్ఓ కార్యలయం నుంచి ప్రత్యేకంగా వచ్చిన గైనకాలజిస్టు డాక్టర్ తేజశ్విని స్థానిక 24గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు,బాలింతలకు సోమవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఆయా గ్రామాల్లో గర్భిణుల ఆరోగ్య సంరక్షణపై మాతాశిశు మరణాలు తగ్గించేందుకు వైద్యాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని వారికి వైద్యసేవలు అందిస్తున్నామని ఆమె తెలిపారు. ప్రధానమంత్రి మాతృత్వ యోజన పథకంలో భాగంగా మాయలూరు, ఉయ్యాలవాడ, పెద్దయమ్మనూరు పీహెచ్‌సీల్లో 84 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి వైద్యాధికారులు రమేష్‌చంద్ర బాలాజీ, రాబర్ట్ కెనడీ, అశోక్, శివలింగమ్మ మందులు అందజేశారు.

గ్యాస్ ధరల పెంపుపై వినూత్న నిరసన

నంద్యాల(అర్బన్): వంట గ్యాస్ సిలిండర్ ధరల పెంపులపై ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఆధ్వర్యంలో సిలిండర్ శవయాత్రతో మహిళలు వినూత్న నిరసన చేపట్టారు. మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గా భవాని ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి పాడెపై సిలిండర్‌ను ఉంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శవయాత్ర నిర్వహించారు. దుర్గాభవాని మాట్లాడుతూ 2014లో వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.400కు పెంచితే బీజేపీ నాయకులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. మరి నేడు బీజేపీ రూ.1150 పెంచినా ఆ పార్టీ నాయకులు నోరు మెదపక పోవడం దుర్మార్గమన్నారు. ఏపీ చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, నాయకురాళ్లు సుగుణమ్మ, నారాయణమ్మ, లక్ష్మిదేవమ్మ, మహేశ్వరమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడుసుబ్బరాయుడు, హరిబాబు, గోకారి పాల్గొన్నారు.



సిలిండర్‌కు శవయాత్ర నిర్వహిస్తున్న మహిళలు

చలువ పందిళ్ల ఏర్పాటు

నంద్యాల(సిటీ): జిల్లా కేంద్రమైన నంద్యాల పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మున్సిపల్ అధికారులు సోమవారం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. గత నెల 15న సాక్షి దినపత్రికలో ప్రచురించిన 'కలెక్టర్ ఆదేశాల బేఖాతరు' అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు స్పందించిన అధికారులు చలివేంద్రాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో ట్రాఫిక్ సిగ్నల్స్ పడినప్పుడు వాహనదారులు ఇబ్బందులు పడకుండా ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్లు, 8 ప్రాంతాల్లో చలి వేంద్రాలు ఏర్పాటు చేశారు.



సంజీవనగర్‌లో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

బంజార సంఘం అధ్యక్షుడి ఎన్నిక

నంద్యాల(అర్బన్): ఆలిండియా బంజార సేవా సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా అడ్వకేట్ విజయ్ నాయక్ ఎన్నికయ్యారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఏపీ బంజార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ నాయక్ ఆధ్వర్యంలో విజయ్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.